## క్లుప్తంగా

### మందుబాబులకు రూ.11లక్షల జరిమానా

**పార్వతీపురం రూరల్:** గత రెండు నెలల్లో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 109 మంది వాహన చోదకులకు ఒకరికి రూ.10వేలు చొప్పున లోక్ అదాలత్ ద్వారా జరిమానా విధించినట్టు పార్వతీపురం పట్టణ సీఐ కె.మురళీధర్, ఎస్ఐ గోవింద శనివారం తెలిపారు. మొత్తంగా 109 మందికి రూ.11లక్షలు జరిమానాను విధించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల దృష్ట్యా మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. అలా నడిపిన కారణంగా వారితో పాటు రోడ్డుపై తోటి వాహన చోదకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అవగాహనతో రోడ్డు భద్రత నియమాలు పాటిస్తూ మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు.

### స్పందించారు.. తీగజాతి మొక్కలు తొలగించారు



వెంకంపేట ఎస్సీ కాలనీ వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌పై అల్లుకున్న తీగజాతి మొక్కలను తొలగించిన విద్యుత్ శాఖ సిబ్బంది

**పార్వతీపురం రూరల్:** మండలంలోని పలు విద్యుత్ స్తంభాలపై, విద్యుత్ సరఫరా తీగలపై, ట్రాన్స్‌ఫార్మర్‌పై అల్లుకున్న తీగజాతి మొక్కలతో రైతులకు, పశువులకు ప్రమాదం జరిగే అవకాశం ఉండడంతో విద్యుత్ తీగలు తాకేలా.. అనే శీర్షికతో శనివారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. పార్వతీపురం గ్రామీణ ప్రాంత విద్యుత్ శాఖ సిబ్బంది వైకేఎం కాలనీ, వెంకంపేట, వెంకంపేట, చినబొండపల్లి, ఎమ్మార్‌నగరం పరిసర ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న తీగజాతి మొక్కలను తొలగించారు.

### మునిగిన పంట పొలాలు



వీపీ రాజుపేట సమీపంలో నీట మునిగిన వరి

**పాలకొండ రూరల్:** కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. మండల పరిధిలోని జంపరకోట, వీపీ రాజుపేట, తంపటాపల్లితోపాటు శివారు గ్రామాల్లోని పంట పొలాల్లో వరద నీరు చేరింది. దీంతో పొలాల్లోని నీటిని తరలించే పనుల్లో అన్నదాతలు బిజీగా ఉన్నారు. అలాగే పాలకొండ – వీరఘట్టం రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. ఇదిలా ఉంటే ఏఓ ప్రసాద్ మాట్లాడుతూ.. పొలాల్లో చేరిన నీటిని బయటకు పంపిస్తే ఇబ్బందులుండవని చెప్పారు. బూస్టర్ డోస్‌గా యూరియా మరోసారి వేయాలని సూచించారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు



ఆర్‌డీవలసలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీవో గోపాలరావు

**గరుగుబిల్లి:** వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో ఎల్.గోపాలరావు తెలిపారు. మండలంలోని పెదగుడబ, ఆర్‌డీవలస గ్రామాల్లో చేపడుతున్న పారిశుధ్య పనులను ఆయన శనివారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా ఇళ్ల వద్దకు వస్తున్న గ్రీన్ అంబాసిడర్‌లకు తడిచెత్త, పొడిచెత్తను వేర్వేరుగా అందించాలని తెలిపారు. ఇంటి ముంగిట మురుగునిల్వలు లేకుండా చూడాలని, తాగునీటి బోర్లు, రక్షిత మంచినీటి పథకాల వద్ద క్లోరినేషన్ చర్యలు చేపట్టాలన్నారు.

### లోక్ అదాలత్ విజయవంతం

**పాలకొండ రూరల్:** పట్టణంలోని న్యాయస్థానం ఆవరణలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతమైంది. ఈ సందర్భంగా న్యాయమూర్తి చందక హరిప్రియ 339 కేసులకు పరిష్కారం చూపారు. అలాగే అపరాధ రుసుం కింద రూ. 11 లక్షలు ప్రభుత్వ ఖజానాకు జమయ్యేలా తీర్పు చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు ఉత్తరావిల్లి మురళీ మోహనరావు, శ్రీనివాసరావు, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# సున్నా వడ్డీకి ఎగనామం!



పార్వతీపురం పట్టణంలో స్వయం సహాయక సంఘాల సమావేశం(ఫైల్)

- ఎన్నికల హామీ అమలుకు నోచుకునేనా..!
- డ్వాక్రా సంఘాలకు తప్పని భారం
- సున్నా వడ్డీ పథకం అమలు చేయాలంటున్న మహిళలు

**పార్వతీపురం టౌన్:** 'మహిళలకు అండగా ఉంటాం.. అన్ని రంగాల్లో మహిళలను ముందుకు తీసుకువెళతాం.. మహిళలకు ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం.. డ్వాక్రా అక్క చెల్లెమ్మలకు రుణాలు ఇస్తాం.. సున్నా వడ్డీ రుణాలను మంజూరు చేస్తాం..' ఇవన్నీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి నాయకులు ఇచ్చిన హామీలు. అధికారం చేపట్టి ఏడాదిన్నర గడుస్తున్నా ఎన్నికల హామీలు నోచుకోవడం లేదు. మహిళలను అన్ని విధాలా మోసం చేస్తూనే వస్తున్నారు. ఈ క్రమంలో సున్నా వడ్డీ రుణాలు కలగానే మిగిలాయని డ్వాక్రా మహిళలు మండిపడుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 18వేల స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. వీటిలో రెండు లక్షల మందికి పైగా మహిళలు ఉన్నారు. ఏటా స్వయం సహాయక సంఘాల ద్వారా రూ.25 కోట్ల మేర రుణాలు తీసుకుంటున్నారు. ఆయా కేటగిరీలను బట్టి 9 నుంచి 13.5శాతం వరకు బ్యాంకుకు వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ప్రతీ ఏటా సుమారు రూ.13.36 కోట్ల వడ్డీ భారం పడుతుంది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే స్వయం సహాయక సంఘాల మహిళలపై వడ్డీభారం తగ్గిస్తామని కూటమి పార్టీ ఎన్నిల ముందు హామీ ఇచ్చింది. గతం కంటే మాదిరిగా రుణాలు ఎక్కువగా అందజేస్తామని అట్టహాసంగా ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు పూర్తయ్యింది. కానీ మహిళలకు ఇచ్చిన సున్నా వడ్డీ హామీ మాత్రం అమలుకు నోచుకోలేదు.

#### సున్నా వడ్డీ కోసం ఎదురు చూపులు

మహిళల స్వయం ఉపాధి పొందేందుకు రుణాలు పొందుతున్నామని కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు వడ్డీ రుణ మాఫీ చేస్తామని మాటిచ్చి నేటికి అమలు చేయకపోవడం లేదని మహిళలు తెలుపుతున్నారు. వడ్డీ రుణమాఫీ ఉన్నట్లైతే చిన్నచిన్న పరిశ్రమలు వంటివి ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వం రుణమాఫీ చేయకపోవడం, రుణాలు మంజూరు చేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

#### మంజూరు చేస్తాం



రుణాలను మంజూరు చేసేందుకు బ్యాంకర్లతో మాట్లాడి ప్రణాళికలు రూపొందించాం. ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీలకు రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టాం. అర్హులైన వారందరికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు రుణాలు మంజూరు చేస్తాం. స్వయం సహాయక సంఘాలకు రుణాలు మంజూరు చేయడంలో ముందుంటాం.

– సుధారాణి, డీఆర్‌డీఏ పీడీ, పార్వతీపురం మన్యం

#### గతంలో క్రమం తప్పకుండా..

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సున్నా వడ్డీ పేరుతో మహిళలకు వడ్డీ రాయితీనిచ్చేది. గత ఐదేళ్ల కాలంలో మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి ఆర్థిక భరోసా కల్పించేందుకు జిల్లాలో 2,24,589 మంది మహిళల ఖాతాల్లో రూ.30.50 కోట్ల మేర వడ్డీ రాయితీని బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది. దిగువ, మధ్య తరగతి మహిళల అభివృద్ధే లక్ష్యంగా బ్యాంకులతో పాటు మల్టీ నేషనల్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకొని వ్యాపారం, స్వయం ఉపాధి రంగాల్లో మహిళలను ప్రోత్సహించేది. క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తీసుకున్న వారి వడ్డీ రాయితీని ప్రభుత్వం భరించింది. వైఎస్సార్ ఆసరా పథకం కింద ఆర్థిక సహకారం అందించడంతో పాటు వ్యాపార రంగంలో రాణించేలా మహిళలకు మెలకువలు నేర్పించేది. 45 – 60 ఏళ్ల మధ్య వయస్సు గల ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ మహిళలకు ఏటా రూ.18,750చొప్పున నేరుగా వారి ఖాతాల్లో జమ చేసి రూ. 75వేలను మహిళలకు అందించి ఆదుకుంది.

# మర్యాద పూర్వక కలయిక



కలెక్టర్ డా. ఎస్.ప్రభాకర్‌రెడ్డికి స్వాగతం పలికి పూలమొక్కను అందజేస్తున్న జేసీ యశ్వంత్ కుమార్‌రెడ్డి







కలెక్టర్‌కు పూలమొక్కలను అందజేస్తున్న పాలకొండ సబ్ కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్, సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి, ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

**పార్వతీపురం రూరల్:** జిల్లా కలెక్టర్‌గా శనివారం బాధ్యతలు స్వీకరించిన డా.ఎస్.ప్రభాకర్ రెడ్డిని జాయింట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, సబ్‌కలెక్టర్లు ఆర్.వైశాలి, పవర్ స్వప్నిల్ జగన్నాథ్, ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి, ఏఎస్పీ అంకితా సురానలు మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కలను అందజేశారు.

ఈ మేరకు బదిలీపై వచ్చి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు వీరంతా అతిథి గృహంలో ఘన స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో కె.హేమలత, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలి

**సాలూరు:** ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లపై అసెంబ్లీలో చర్చించి, న్యాయం చేయాలని ఏపీటీఎఫ్ పట్టణ, మండల నాయకులు వెంకటేశ్వరరావు, పాణిగ్రహి, గౌరీశంకర్ తదితరులు కోరారు. ఏపీటీఎఫ్ నిరసన వారంలో భాగంగా శనివారం పట్టణంలోని స్త్రీశిశు, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి సంధ్యారాణి కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో నంబరు 57ను తక్షణం అమలు చేయాలని, 12వ పీఆర్‌సీ కమిషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల బకాయిలను చెల్లించాలని, ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, యాప్‌లు, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు.

## 17 నుంచి విశ్వకర్మ జయంత్యుత్సవాలు

**పాలకొండ రూరల్:** ఈ నెల 17 నుంచి 19 వరకు స్థానిక కోమటిపేట సమీపంలో గల శ్రీ సనారి విశ్వేశ్వరస్వామి ధాన్య మందిరంలో విశ్వకర్మ జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు విశ్వబ్రాహ్మణ స్వర్ణకార సేవా సంఘ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శనివారం సంఘ సభ్యులు సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా సంఘ అధ్యక్షుడు టీకే ప్రసాదరావు ఆచారి మాట్లాడుతూ.. ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

## బెల్ట్ షాపులు నిర్వహిస్తే చర్యలు



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ పద్మావతి

**సీతానగరం:** ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం బెల్ట్ షాపులు నిర్వహించే వారిపై ఉక్కు పాదం మోపుతామని సీఐ డి.పద్మావతి అన్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఆమె మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఉన్న గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నట్టు గుర్తించిన గ్రామాల్లో సిబ్బందితో దాడులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ మేరకు పలు గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్నట్లు గుర్తించిన 145 మంది నిర్వాహకులపై కేసులు నమోదు చేసి 226 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం సీసాలపై ఉన్న ఎమ్మార్పీకే విక్రయించాలని సూచించారు. నిర్వాహకులు లేదా ఇంకెవరైనా ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే స్థానికులు టోల్‌ఫ్రీ 9440902373 నంబరుకు వెంటనే తెలియజేయాలని ఆమె కోరారు.

## 15 నుంచి 'గాలికుంటు' టీకాలు

**గరుగుబిల్లి:** జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో వ్యాక్సినేషన్ చేపడుతున్నట్లు నాగూరు పశువైద్యాధికారి అలజంగి స్రవంతి ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. గరుగుబిల్లి, ఉల్లిబద్ర, రావివలస పశు వైద్యశాలల పరిధిలో చేపట్టే వైద్య శిబిరాల్లో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరుగుతుందని, ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# తిరుగుబాటు మొదలైంది..

- ఆర్థిక బకాయిలు, విద్యారంగ సమస్యలపై ఉపాధ్యాయుల పోరుబాట
- రాష్ట్ర వ్యాప్తంగా యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి బైక్ జాతా
- ఈ నెల 15 నుంచి 19 వరకు ఐదు ముఖ్య పట్టణాల్లో రణభేరికి రంగం సిద్ధం
- సెప్టెంబర్ 25న విజయవాడలో భారీ బహిరంగ సభ



రణభేరికి సిద్ధమవుతున్న యూటీఎఫ్ నాయకులు

**వీరఘట్టం:** ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం వచ్చాక విస్మరించారు. దీంతో ప్రభుత్వాన్ని నిలదీసేందుకు యూటీఎఫ్ రణభేరి మోగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఈ నెల 15 నుంచి 19 వరకు ముఖ్య పట్టణాల్లో బైక్ జాతాతో రణభేరి చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే సెప్టెంబర్ 25న విజయవాడలో భారీ బహిరంగ సభ ద్వారా ఉపాధ్యాయ సమస్యలను గొంతెత్తి నినదించేందుకు యూటీఎఫ్ కార్యచరణ సిద్ధం చేస్తోంది.

**ఈ నెల 15 నుంచి ..**

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15 నుంచి 19 వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఐదు ముఖ్య పట్టణాల్లో బైక్‌జాతా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పర్యటించి సమస్యలను అధికారులు, పాలకుల దృష్టికి తీసుకురానున్నారు.

**ఇవీ యూటీఎఫ్ డిమాండ్లు..**

- ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలి.
- పాఠశాలల్లో ఒత్తిడి లేకుండా పనిచేసే వాతావరణం కల్పించాలి.
- ఉమ్మడి సర్వీస్ రూల్స్ ద్వారా ప్రమోషన్లు ఇవ్వాలి.
- 12వ పీఆర్‌సీ ప్రకటించాలి.
- పీఆర్‌సీ ప్రకటించే వరకు 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలి.
- పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలు విడుదల చేయాలి.
- పేరుకుపోయిన రూ.వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లించాలి.
- సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం అమలు చేయాలి.
- అస్తవ్యస్తంగా పునర్:వ్యవస్థీకరించిన పాఠశాలల వ్యవస్థను సరిచేయాలి.




యూటీఎఫ్ ఆవిష్కరించిన రణభేరి పోస్టర్

#### బైక్‌జాతాను విజయవంతం చేయండి..

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 15న యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టనున్న బైక్ జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి. కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైంది. తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు చేపడుతున్న రణభేరిని విజయవంతం చేయాలి.

#### చలో విజయవాడకు సిద్ధం కావాలి



ఆర్థిక, విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని సార్వత్రిక ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మరిచారు. గతంలో పోరుబాట ద్వారా ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వానికి తెలియజేశాం. ఈ సారి రణభేరి ద్వారా బైక్‌జాతా చేపట్టి ఉపాధ్యాయుల ఐక్యతను చాటి చెబుదాం. అప్పటికీ ప్రభుత్వంలో మార్పు రాకపోతే ఈ నెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడతాం. ప్రతి ఒక్కరూ చలో విజయవాడకు సిద్ధం కావాలి.

– ఎస్.మోహనరావు, యూటీఎఫ్, రాష్ట్ర కార్యదర్శి

# యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

**పార్వతీపురం టౌన్:** పరిశ్రమలు నెలకొల్పి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరుద్యోగ సమస్యలపై నిరసన తెలిపేందుకు ఈ నెల 17న నిర్వహించనున్న రాష్ట్ర వ్యాప్త సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం పార్వతీపురం పట్టణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను భర్తీ చేయాలని, నిరుద్యోగ యువతకు ఎన్నికల హామీల్లో భాగంగా ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాలు ఇచ్చేంత వరకు నిరుద్యోగ భృతి రూ.3వేలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. అమరావతి, రాజధాని ప్రాంతాన్ని తక్షణమే ఫ్రీ జోన్‌గా ప్రకటించాలన్నారు. ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రొఫెసర్లు, లెక్చరర్లు, టీచింగ్, నాన్ టీచింగ్, లైబ్రరీలతో ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను అన్ని విభాగాల్లో భర్తీ చేయాలన్నారు. పేద, నిరుద్యోగ యువతకు ఉచిత స్టడీ సర్కిళ్లను అందుబాటులోకి తీసుకువచ్చి ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేసి వారి భవిష్యత్‌పై ఆలోచన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కె.గోపినాయుడు, నాయకులు ప్రవీణ్, ప్రశాంత్, జగదీష్, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

#### గిరిజనుల వినూత్న నిరసన



పార్వతీపురం రూరల్ మండలం గంగాపురం పంచాయతీ తాన్నవలస, తొక్కుడువలస, సంగంవలస పంచాయతీ సీతంపేట, వెలగవలస పంచాయతీలో సందివల, దోనిగెడ్డవలస, ములగవలస గిరిజన గ్రామాల రైతులు శనివారం వినూత్నంగా నిరసన తెలిపారు. దశాబ్దాలుగా తాము సాగు చేస్తున్న భూములకు పన్ జీ, పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరు చేయాలని ఏళ్ల తరబడి అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోతుందని మోకాళ్లపై నిల్చొని చెప్పులు చూపిస్తే.. అధికారులు ఇచ్చిన రసీదులు చూపుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సీపీఎం నేత పి.రాముతో పాటు పి.వరాలు, ఎం.రాము, కె.చిరంజీవి, ఎ.సోములు, ఎం.భావ, టి.రాము, ఎం.బిరుసు, జి.సింహాచలం, జె.శివుడు తదితరులు పాల్గొన్నారు. – పార్వతీపురం రూరల్

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు, కార్మికులు

**సాలూరు:** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ నాయకులు శంకర్, రవి తదితరులు కోరారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ రత్నకుమార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆగస్టు నెల నుంచి జీతాలు ఇవ్వలేదని వచ్చే నెల 5లోగా ఆగస్టు, సెప్టెంబరు నెలల జీతాలు ఇవ్వాలని,చనిపోయిన పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు నష్ట పరిహారాన్ని ఇవ్వాలని, పెరిగిన జనాభాకు సరిపడా కార్మికులను పెంచాలని తదితర డిమాండ్లు చేశారు.

# కూలీల బెడదతో డ్రోన్‌లతో పిచికారీ



మందు ద్రావణాన్ని డ్రోన్ ట్యాంక్‌లో వేస్తున్న రైతులు



వరిచేనులో మందు ద్రావణాన్ని స్ప్రే చేస్తున్న డ్రోన్ యంత్రం

**సీతానగరం:** మండలంలో కూలీల కొరత కారణంగా డ్రోన్ల సహాయంతో వ్యవసాయ సాగులో ఎరువులు, క్రిమి సంహారక మందులను పంట పొలాల్లో రైతులు పిచికారీ చేయిస్తున్నారు. బూర్జ, సూరంపేట, మరిపివలస, కృష్ణారాయపురం తదితర గ్రామాల్లో డ్రోన్ల సహాయంతో క్రిమి సంహారక మందులను రైతులు స్ప్రే చేయించారు. పంటల సాగులో కూలీల బెడద ఎక్కువగా ఉండడంతో రైతులు వీటిని ఆశ్రయిస్తున్నారు. క్రిమి సంహారక మందులు స్ప్రే చేసేందుకు కూలీలు ఎవరూ ముందుకు రావడంతో వీటి వాడకం పెరిగింది. డ్రోన్ల సాయంతో చేస్తున్న ఈ పనులతో సమయం కలిసి వస్తుందని, ఖర్చు కూడా తగ్గుతుందని రైతులు పేర్కొంటున్నారు.

# క్వారీ అనుమతులు రద్దు చేయాలి

**పార్వతీపురం టౌన్:** తమ గ్రామం పక్కనే ఉన్న ఎలుగుల మెట్టపై క్వారీ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని పార్వతీపురం మండలం హెచ్.కారాడవలస గ్రామస్తులు కోరారు. శనివారం ఎమ్మెల్యే బోనెల విజయ చంద్రను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. క్వారీ ఏర్పాటు జరిగితే భవిష్యత్తులో జరగబోయే నష్టాన్ని, ఇబ్బందులను ఎమ్మెల్యేకు వివరించారు. క్వారీ తవ్వకాల వల్ల పంట భూములు, సమీప చెరువులు కలుషితమవుతాయని అన్నారు. పెద్దపెద్ద శబ్దాల వల్ల ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని అన్నారు. వెంటనే క్వారీ తవ్వకాలకు ఇచ్చిన అనుమతులు నిలుపుదల చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ క్వారీ తవ్వకాల అనుమతులు రద్దుపై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లినట్టు చెప్పారు. ప్రజల అభిప్రాయం లేకుండా ఎటువంటి తవ్వకాలు చేయకూడదని, అలా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లానని అన్నారు.

### 15న ప్రత్యేక మండలంగా ప్రకటించాలని ర్యాలీ

**కురుపాం:** నీలకంఠాపురాన్ని ప్రత్యేక గిరిజన మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15వ తేదీన ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ అడ్డాకుల మన్మధరావు తెలిపారు. ఇదే విషయమై పలు గ్రామాల ప్రజలతో శనివారం సమావేశమై మాట్లాడారు. తూర్పు ముఠా వైపు ఉన్న 12 పంచాయతీలకు చెందిన యువత,ప్రజలంతా ర్యాలీలో పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు.